సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 31 । జనవరి । 2024



అర్హులందరికీ గ్యారంటీలు

అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



అభివృద్ధికి నిధులు

నియోజకవర్గ అభివృద్ధికి సీఎం సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. 8లో▸



సమాజ మార్గనిర్దేశకులు

ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి హుండీ ఆదాయం రూ.14.12 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయ దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో, దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 69 రోజులకు గాను, భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా. రూ.14,12,216 సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి, పంచాయతీ కార్మికులు

కేశంపేట: పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అందించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ సిబ్బందితో కలిసి ఎంపీఓ నర్సింలుకు తమ డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తమ డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ సమ్మె చేపడితే అప్పుడు కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కారోబార్లను, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని.. కార్మికులకు గుర్తింపు కార్డులను ఇప్పించాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన కార్మికుల నియామకాలు చెపట్టాలన్నారు. అనంతరం పంచాయతీ కార్మికుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి



ర్యాలీ ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్: రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదాలను నివారించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో సివిల్, ట్రాఫిక్ పోలీస్, ఎంవీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మానవ తప్పిదాలతో అధిక శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడంతోనే మృత్యువాత పడ్డారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రతీ వాహనదారుడు విధిగా ధ్రువ పత్రాలు, లైసెన్సులను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ప్రతాప్ లింగం, ట్రాఫిక్ ఎస్‌ఐ బాలు నాయక్, ఎంవీఐ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్లతో మంత్రి కొండా సురేఖ ముఖాముఖి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ నేషనల్ పార్కులో మంగళవారం సాయంత్రం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వాకర్లతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కులో ఏ సమస్య ఉన్నా తన ఓఎస్‌డీ దృష్టికి తేవాలని, ఆ నెంబర్‌ను వాకర్లకు ఇచ్చారు. పార్కులో వాక్‌వేకు రెండు వైపులా గ్రీనరీ మరింత పెంచాలని వాకర్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

ఈ- కేవైసీతో ఏరివేతనే!

బోగస్ రేషన్ లబ్ధిదారులకు చెక్ పెట్టే అవకాశం

- గ్రేటర్‌లో 31 శాతం ఈ-కేవైసీకి దూరం
- ఈ యూనిట్లు ఇనాక్టివ్‌గా అనుమానం
- ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు పొడిగింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రజా పంపిణీ వ్యవస్థ సంస్కరణలో భాగంగా ఆహార భద్రత (రేషన్) కార్డులో ఇన్ అక్టివ్ యూనిట్ల (లబ్ధిదారులు)పై పౌరసరఫరాల శాఖ దృష్టి సారించింది. చనిపోయిన, అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించేందుకు ఐదు నెలలుగా రేషన్ ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగిస్తోంది. అయితే ఇప్పటి వరకు మహానగర పరిధిలో 69 శాతం ఈ-కేవైసీ మించలేదు. మిగిలిన 31 శాతం ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. వీటిని ఇన్ అక్టివ్ యూనిట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా కూడా కోట్లాది మంది ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ గడువును పొడిగించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి నెలాఖరులోగా గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వేలిముద్రలు ఇచ్చి ఈ-కేవైసీ పూర్తి చేయని వారు త్వరగా పూర్తి చేయాలని సూచించింది. వాస్తవంగా గడువు పొడిగింపు కొనసాగుతూ వస్తోంది. మూడు నెలల క్రితం వరకు లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసేందుకు చాలా మంది రేషన్ దుకాణాల ముందు బారులు తీరారు. దాదాపు అందుబాటులో ఉన్న వారి ఈ-కేవైసీ పూర్తి అయినట్లు అధికారులు భావిస్తున్నారు.



ఇనాక్టివ్ యూనిట్ల గుర్తింపు

రేషన్ ఈ-కేవైసీ పునరుద్ధరణ ద్వారా అందుబాటులో లేని, మృతి చెందిన యూనిట్ల ఏరివేత ప్రక్రియ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా ఒక్కో షాపు పరిధిలో వందలాది యూనిట్లు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులో లబ్ధిదారులుగా ఉన్న వారు చనిపోయినా వారి కుటుంబ సభ్యులు పేరును తొలగించకుండా రేషన్ డ్రా చేస్తూ వస్తున్నారు. అదేవిధంగా పెళ్లయినవారు, ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిన వారు ఉన్నారు. దీంతో అసలైన లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇది పూర్తి చేసిన వారికే రేషన్ సరుకులు పంపిణీ చేయనుంది. వేలిముద్రలు ఇవ్వని సభ్యులను రేషన్ కార్డు నుంచి తొలగించే అవకాశాలున్నాయి. వాస్తవంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ ప్రక్రియ తర్వాత ఇప్పటి వరకు కేవైసీ పునరుద్ధరణ జరుగలేదు. ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త రేషన్ కార్డులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మూడు లక్షల పైనే

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అందుబాటులో లేని యూనిట్లు సుమారు మూడు లక్షలపైగానే ఉండొచ్చని పౌరసరఫరాల అధికారులు అంచనా వేస్తున్నారు. అందులో మృతి చెందిన వారి యూనిట్లు (లబ్ధిదారులు) లక్షపైనే ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు ఇప్పటివరకు ఈ- కేవైసీ పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యుల్లో అందుబాటులో లేని యూనిట్లు రెండు లక్ష వరకు ఉనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

ఈ-కేవైసీ ఇలా..

రేషన్ కార్డులో పేరున్న కుటుంబ సభ్యులందరూ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి, రేషన్ కార్డు నంబర్ చెప్పి వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. రేషన్ కార్డు సంఖ్య, ఆధార్‌తో లింక్ అవుతుంది. అనంతరం ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నట్లు తెలియజేస్తూ ఈపోస్ మిషన్ నుంచి చిన్న రసీదు కూడా వస్తుంది. రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్నవారు ఏ రేషన్ దుకాణానికైనా వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయవచ్చు. అలాగే కుటుంబ సభ్యులందరూ ఒకేసారి వెళ్లి వేలిముద్రలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎప్పుడు, ఎక్కడ వీలైతే అప్పుడు ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

మహనీయులను మరవొద్దు

కలెక్టర్ శశాంక



మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పనంగా పెట్టారని అన్నారు. వారి పోరాట స్ఫూర్తి భావి తరాలకు తెలియజేయాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ ఫలాలతోనే నేడు ప్రశాంతంగా ఉంటున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

‘జలశక్తి అభియాన్’తో సత్ఫలితాలు



జలశక్తి అభియాన్ కేంద్ర బృందంతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: జలశక్తి అభియాన్ ద్వారా జిల్లాలో నీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు అంకిత్ మిశ్రా (డిప్యూటీ సెక్రెటరీ), అంకిత్ విశ్వకర్మ సైంటిస్ట్ మంగళవారం జిల్లాకు విచ్చేశారు. వీరికి యంత్రాంగం తరఫున అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. జలశక్తి అభియాన్ జిల్లాలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ జలశక్తి బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నీటిని నిల్వ ఉంచే ప్రయత్నంలో భాగంగా ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరుబావులు, చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణం చేసుకొని నీటిని ఒడిసి పట్టి సాగుకు ఉపయోగించడం జరిగిందన్నారు. తాగు, సాగునీటికి కొరతలేదని స్పష్టం చేశారు. జిల్లాలోని 558 పంచాయతీల్లో తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షిస్తూ పచ్చదనం పెంపొందించేలా చేశామన్నారు. గ్రామ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామన్నారు. జలశక్తి అభియాన్ సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజ, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారి బన్సీలాల్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

5న సీఎం రేవంత్‌రెడ్డి రాక



హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే అవకాశం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- హెలిప్యాడ్‌కు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్నారు. ఫిబ్రవరి 5న సీఎం పర్యటన ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి, నారాయణపేట జిల్లా ఉన్నతాధికారులు కొడంగల్, కోస్గి ప్రాంతాల్లో పర్యటించారు. కోస్గిలో హెలికాప్టర్ దిగడానికి అనుకూలంగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సీఎం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. పెద్ద ఎత్తున పనులు ప్రారంభం కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

పనులపై సమీక్ష

నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కొడంగల్‌లోని కడా కార్యాలయంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, మయాంక్ మిట్టల్‌తో చర్చించారు. బందోబస్తుతో పాటు శంకుస్థాపనల ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హెలిప్యాడ్, పార్కింగ్, రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్‌ఐ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో వచ్చే నెల 11, 12 వ తేదీలలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి మంగళవారం ఆవిష్కరించారు. విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఉపాధ్యాయుల్లో బాధ్యతలు మరింత పెంచే విధంగా చైతన్యం కలిగిస్తాయని ఆమె ఆకాంక్షను వ్యక్తం చేశారు. సభలు విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి



కంసాన్‌పల్లిలో సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తదితరులు

షాద్‌నగర్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన మహిళా పరస్పర సహాయక పొదుపు, పరపతి సహకార సంఘం భవనం, కడియాల కుంట తండాలో ప్రహరీని మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని అన్నారు. సంఘాల ద్వానా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ ఆదాయాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, సర్పంచ్ బసిరెడ్డి పద్మ పాల్గొన్నారు.

ధరణిలో సమూల మార్పులు

ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి



భూ సమస్యలపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి తదితరులు

యాచారం: ధరణి పోర్టల్‌తో భవిష్యత్తులో రైతులకు ఇబ్బందుల్లేకుండా సమూల మార్పులు చేస్తున్నట్లు ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు, ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో భూ న్యాయ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పట్టాదారు, పాసుపుస్తకాల్లో తమ భూములు రికార్డులు ఎప్పుడు నమోదవుతాయోనని నిత్యం కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు చెప్పులరిగేలా తిరిగారని గుర్తు చేశారు. ధరణి పోర్టల్‌లో తప్పుగా నమోదైన భూదాన్, సీలింగ్ రికార్డులతో రైతులు కంటికి కనుకు లేకుండా గడిపే పరిస్థితి వచ్చిందని అన్నారు. ధరణిలో సమూల మార్పుల కోసం రేవంత్‌రెడ్డి సర్కార్ ఓ కమిటీ వేసిందని.. దీని ద్వారా రైతుల నుంచి జిల్లా కలెక్టర్లు, సీసీఎల్ఏ వరకు అందరి అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలిపారు. పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. భవిష్యత్తులో రైతులకు ఇబ్బంది లేకుండా మళ్లీ వీఆర్ఏ, వీఆర్‌ఓ వ్యవస్థను తీసుకొచ్చే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సరైన అధికారులు లేకపోవడంతో భూరికార్డుల్లో తప్పులు దొర్లుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. చేర్పులు, మార్పులు, సవరణల కోసం తహసీల్దార్లకు కొన్ని అధికారాలిచ్చే విధంగా ధరణి కమిటీ సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు చెప్పారు. యాచారం మండలంలో లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న భూ న్యాయ శిబిరాల్లో రైతులు అనేక భూ సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి లీఫ్స్ సంస్థ ప్రతినిధుల కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో లీఫ్స్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలు సీజ్

కందుకూరు: మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీ వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని గూడూరు,కొత్తూర్ పరిధిలో జేసీబీలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో మట్టి తరలిస్తున్నట్లురెవెన్యూ అధికారులు సమాచారం అందింది.ఈ మేరకు వారు మంగళవారం పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. రెండు చోట్ల నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్ చేసి పీఎస్‌కు తరలించినట్లు తహసీల్దార్ గోపాల్ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడి సెల్‌ఫోన్లు చోరీ

నిందితులకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చిన హయత్‌నగర్ కోర్టు



రిమాండ్‌కు తరలించిన నిందితులు

అబ్దుల్లాపూర్‌మెట్: యువకులను బెదిరించి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన ముగ్గురు నిందితులకు మంగళవారం హయత్‌నగర్ మెజిస్ట్రేట్ రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన ప్రకారం.. కుంట్లూరులో నివాసముండే శివకుమార్ అతడి స్నేహితులు సందీప్, సాయితేజతో కలిసి ఈ నెల 27న కోహెడ గుట్టమీద నున్న గుడికి వెళ్లారు. వీరు ఫొటో లు దిగుతుండగా అక్కడికి వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని యువకులు శివకుమార్ స్నేహితులను బెదిరించి వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, చేతిగడియారం అపహరించుకుపోయారు. బాధితులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మీర్‌పేట్‌కు చెందిన కృష్ణకుమార్ అలియాస్ కరణ్‌సింగ్, వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కాలనీకి చెంది న ఇరుగు సందీప్, దాసరి సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు రికవరీ చేసి మంగళవారం హయత్‌నగర్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

నవ దంపతుల అదృశ్యం

పహాడీషరీఫ్: నవ దంపతులు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.గురువా రెడ్డి తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్ కలీం కుమారుడు మహ్మద్ ఫెరోజ్(24)కు సయ్యదా అమ్రీన్(21)) అనే యువతితో వివాహమైంది. ఈ నెల 29న సాయంత్రం నవ దంపతులు షాద్‌నగర్‌లోని ఏఎంసీ ఆస్పత్రికి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఫెరోజ్ తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ 'ఆరు గ్యారంటీ'లు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

మంచాల: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని లింగంపల్లి, బండలేమూర్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదల తలరాతలు మారుతాయన్నారు. గత ప్రభుత్వం వనరులను కొల్లగొట్టి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరుతో స్కాంలకు పాల్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. లింగంపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో సీసీరోడ్లు, రూ.9లక్షలతో యూజీడీ పనులు, బండలేమూర్‌లో రూ.15లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.14లక్షలతో సీసీ రోడ్లు, రూ.20లక్షలతో నిర్మించిన అంబోత్ తండా గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. బండలేమూర్, చెన్నారెడ్డి గూడ గ్రామాల్లో వీఆర్‌వస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను సందర్శించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ సభ్యు రాలు మర్రి నిత్యారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వినోద, మంగ, ఆరుట్ల సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురా లు గుండమోని జయమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఎడ్మా నరేందర్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, నాయ కులు ప్రేమాకర్ రెడ్డి,హన్మంత్‌రెడ్డి, చంద్రయ్య, మల్లేశ్, శ్రీధర్, శ్రీను, మల్లేష్, జంగయ్యగౌడ్, మూర్తి, ఐల్లయ్య, సత్తయ్య, గణేశ్ వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'హైనా' బాధితులకు పరిహారం

ఇద్దరు రైతులకు రూ.7.70 లక్షల చెక్కు అందజేత



పార్వతమ్మ, అంజయ్యలకు చెక్కులు అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

యాచారం: హైనాల దాడిలో మృతి చెందిన గొర్రెలకు సంబంధించి బాధిత రైతులకు మంగళవారం అటవీ శాఖ అధికారులు పరిహారం అందజేశారు. గతేడాది నందివనపర్తి గ్రామానికి చెందిన పార్వతమ్మ, తాడిపర్తి గ్రామానికి చెందిన బైకని అంజయ్యలకు చెందిన మందలపై హైనాలు దాడి చేడయంతో 80 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. నందివనపర్తి, తాడిపర్తి గ్రామాల సర్పంచులు ఉదయశ్రీ, రమేష్‌లు అటవీశాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేశారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఇద్దరి రైతులకు కందుకూరులోని అటవీ శాఖ కార్యాలయంలో రూ.7.70లక్షల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు భావన, విజయభాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పాత బ్రాహ్మణపల్లిలో వైకుంఠ ధామాన్ని ప్రారంభించారు. గ్రామ సమీపంలో నిర్మించే బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 85 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కొత్త బ్రాహ్మణపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అర్కపల్లి గ్రామంలోని బిక్కన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయాగ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగు నీరందిస్తామన్నారు. గ్రామాలకు, తండాలకు బీటీ రోడ్లు వేయిస్తామన్నారు. గత పాలకుల చేతిలో నియోజకవర్గం వెనుకబడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దళపతి గౌడ్, సర్పంచ్‌లు బోజమ్మ బల్‌రెడ్డి, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు పాండుగౌడ్, ఎంపీడీఓ రాఘువులు, తహసీల్దార్ నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీ బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: ఉరేసుకుని ఓ తాపీ మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన ప్రకారం.. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన బి.అంకారావు(50) కొన్నేళ్లుగా వనస్థలిపురం శ్రీకృష్ణదేవరాయనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఇంటి నుంచి బైక్‌పై మంగళపల్లి సమీపంలోని ఏవీఎస్ వెంచర్ వద్దకు వచ్చి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వాహనం ఢీ..

లారీ డ్రైవర్ మృతి

చేవెళ్ల: రోడ్డు దాటుతున్న ఓ లారీ డ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని అంతారం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్నూల్ జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన బోయ రంగస్వామి లారీ డ్రైవర్. సోమవారం రాత్రి మండల పరిధిలోని అంతారం స్టేజీ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనంగా వేగంగా ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రంగస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం కర్నూల్ జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా అతడు చేవెళ్ల మండలంలోనే నివాసం ఉంటున్నట్లు స్థానికుల సమాచారం మేరకు తెలిసిందన్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులోఉంది.

ఉపాధ్యాయులు సమాజ మార్గనిర్దేశకులు

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



హెచ్‌ఎం అరుణను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడ్తాల్: ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లి జెడ్పీహెచ్ ఎస్ హెచ్‌ఎం అరుణ బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రస్తుత హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ.. భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చీమర్ల రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



హాజరైన నిర్వాహకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పార్ట్ టైం ఉద్యోగాల కోసం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్, సాక్షి ప్రింట్ మీడియా మార్కెటింగ్ విభాగం సంయుక్తంగా మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్జనతో పాటుగా కనీస అవసరాలు, తల్లిదండ్రులకు సహకారంగా ఉండేందుకు ఈ జాబ్‌మేళా మంచి అవకాశమన్నారు. అనంతరం సాక్షి మార్కెటింగ్ విభాగం అధికారులు మాట్లాడుతూ..రోజుకు రెండు నుంచి మూడు గంటలు పనిచేస్తూ.. రూ.15వేల నుంచి రూ.25వేల వ రకు సంపాదించుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న పలువురు వి ద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ విభాగం కన్వీనర్ బి.రజిత, సాక్షి మార్కెటింగ్ విభాగం హైదరాబాద్ డివిజన్ జీఎం కీర్తి కిరణ్, ఏజీఎం శివకు మార్‌రెడ్డి, అగ్నివేశ్, మేనేజర్స్ శేఖర్‌రెడ్డి, మహేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి

డీసీపీ సునీతారెడ్డి



వాదే సాల్హెహీన్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: దురలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి సూచించారు. మంగళవారం ఆమె బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాదే సాల్హె హీన్ బస్తీలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్, బాలాపూర్ సీఐ బి.వెంకట్ రెడ్డితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. కొంతమంది వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతూ ఈ ప్రాంతానికి చెడ్డ పేరు తీసుకువస్తున్నారన్నారు. క్షణికావేశంలో కత్తులతో దాడులకు పాల్పడడం సహించరాని నేరమన్నారు. నెల రోజుల వ్యవధిలో రెండు హత్యలు, ఒక హత్యాయత్నం కేసు నమోదయిందని వివరించారు. గంజాయి, డ్రగ్స్‌బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలకు చెక్ పెట్టొచ్చన్నారు. అత్యవసర సమయంలో డయల్-100కు ఫోన్ చేయాలన్నారు. నేర రహిత సమాజ ఏర్పాటుకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమర్‌బామ్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు గృహిణి బలి

చేవెళ్ల: వరకట్న వేధింపులకు ఓ గృహిణి బలైంది. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని ఆలూరులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వీరబ్రహ్మం తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం రాకంచెర్ల గ్రామానికి చెందిన జ్యోతి(23)కి గ్రామానికి చెందిన జయగల రాజుతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న రాజు కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్నాడు. వివాహ సమయంలో ఆరు తులాల బంగారం, రూ.5లక్షల నగదు, బైక్ ఇచ్చారు. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో జ్యోతి పుట్టింటికి వెళ్లింది. ఇటీవలే రాజు తండ్రి చంద్రయ్య బంధువులతో కలిసి జ్యోతి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి కోడలిని తీసుకువచ్చాడు. నాలుగు రోజుల క్రితం ఆలూరులో అత్తగారింటికి వచ్చిన జ్యోతి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకుని మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు, జ్యోతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో శవానికి పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'అవేర్' సేవలు అభినందనీయం

ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సంస్థ అధినేత మాధవన్‌జీ

మహేశ్వరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ సమీపంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పరిశీలించిన ఎమ్మెల్యే రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నిత్యం యోగం, ధ్యానం, వాకింగ్, వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. అవేర్ మాధవన్‌జీ మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, కల్వకుర్తి, అమనగల్లు, తలకొండపల్లి తదితర మండలాలల్లో ఇప్పటికే ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు మేలు చేశారన్నారు. ఈ శిబిరానికి హాజరైన 2,500 మందికి 30 మంది వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవేర్ సంస్థ అధినేత మాధవన్‌జీ, జేఎన్‌టీయూ వీసీ కట్ట నర్సింహారెడ్డి, అవేర్ సంస్థ ప్రతినిధులు రాజవర్ధన్ రెడ్డి, వరుణ్, తరుణ్, వెంకన్న, హిమబిందు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యంపై కేసు నమోదు



పాయల్ (ఫైల్)

పహాడీషరీఫ్: ఏడాది వయసున్న కూతురుతో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన కిషన్ ఆర్య,పాయల్(25) దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. సోమవారం కిషన్ డ్యూటీకి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా అతని భార్య, చిన్న కూతురు కార్తీక కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కిషన్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



తాపీమేస్త్రీలకు కానుకలు అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ బద్రి, డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ


మీర్‌పేట: సిమెంటు వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. మంగళవారం మీర్‌పేటలోని శ్రీరామ స్టీల్ ట్రేడర్స్ డీలర్‌షాపులో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బద్రి మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని, ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. డీలర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమానికి డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ సాహేర్, 30 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడికి యత్నం

- అవమానంతో ఆత్మహత్య
- పోలీసుల అదుపులో సెలూన్ యజమాని



దివ్య (ఫైల్)



నిందితుడు మురళి

మీర్‌పేట: ఓ సెలూన్ యజమాని లైంగిక దాడికి యత్నించడంతో మనస్తాపం చెందిన యువతి సెలూన్‌లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన సువర్ణకు ముగ్గురు కుమార్తెలు. వీరు ప్రస్తుతం సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నారు. రెండవ కుమార్తె దివ్య (18) ఆరు నెలలుగా మీర్‌పేట టీచర్స్‌కాలనీ చౌరస్తాలో 'ది బాబ్ ఫ్యామిలీ సెలూన్'లో పనిచేస్తూ అక్కడే ఉంటోంది. యువతిపై కన్నేసిన సెలూన్ యజమాని మురళి(35) సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సెలూన్‌లోని గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించగా తిరస్కరించింది. అనంతరం అవమానం తట్టుకోలేక దివ్య శానిటైజర్ సేవించింది. విషయం తెలుసుకున్న తల్లి, కుటుంబ సభ్యులు వెంటనే దివ్యను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించి ఇంటికి తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం బాధితురాలి ఆరోగ్యం క్షీణించడంతో కర్మన్‌ఘాట్‌లోని గ్లోబల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె మృతదేహంతో సెలూన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని సముదాయించి పంపించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.